**కథ**

# మంత్రాల పెట్టె

–గోపరాజు నాగేశ్వరరావు

"యామండోయ్! కుంచె చీపురు అరిగిపోయింది. దానితో ఇల్లు ఊడవలేక చస్తున్నాను. కొని ఎన్నాళ్లయిందో తెలుసా...? 'పతి–సతి' సీరియల్ మొదలైన రోజు! ఏమీ అనుకోకుండా కొంచెం బజారుకు వెళ్లి చీపురు పట్టుకొని రండి. అలాగే వస్తూ వస్తూ వీలుంటే నా కొక్క అరడజను జాకెట్టు ముక్కలు కూడా తీసుకు రండి!" అన్నది కాంతమ్మ భర్తవైపు అభ్యర్థనగా చూస్తూ.

రామారావు ఈ మధ్యనే ఉద్యోగం నుంచి రిటైరయ్యేడు. అంతకు ముందు రోజూ ఆఫీసు వ్యవహారాలు, అర్జంటు ఫైళ్లూ, అధికారి వెంట అడపా దడపా క్యాంపులూ తప్ప అతడికి మరో ప్రపంచమే పట్టేది కాదు!

జీతం వచ్చిన రోజు రామారావుకే కాదు, ఇంటిల్లిపాది అందరికీ ఎంత సంతోషంగా ఉండో! అలసిపోయి సాయంత్రం వేళకు రామారావు ఇంటికి రాగానే ఫ్రిజ్ వాటర్ అందించి క్షణాల మీద ఫిల్టర్ కాఫీ కూడా ఇచ్చేవాళ్లు. సరుకులకు, యితర అవసరాలకూ డబ్బు తీసికొని బజారుకు వెళ్లి కావలసినవన్నీ భార్యా, పిల్లలే కొని తెచ్చేవారు. అలాంటిది ఉద్యోగం నుంచి రిటైరయ్యేక తన పట్ల భార్యా బిడ్డల వైఖరిలో మార్పు వచ్చిందని లోలోపలే ఆందోళన పడసాగేడు రామారావు.

క్రమంగా అతగాడి ఆందోళన అంతర్మథనంగా మారింది! 'ఐనా ఈ మానవ సంబంధాలను, రక్త సంబంధాలనూ విచ్చి పోకుండా కాపాడేది ఇంతకూ జీవితమా? జీతమా?' అని ఎన్నోసార్లు తనను తను ప్రశ్నించుకొన్నాడు రామారావు.

'జీతమే' అని తేల్చి చెప్పింది, జీవితం!

"మాట్లాడరేం? యింతకూ బజారుకు వెళ్తారా? లేదా?" అని కాంతమ్మ రెట్టించి అడగ్గానే, ఆలోచనల నుంచి ఉలిక్కిపడి తేరుకొన్నాడు రామారావు.

"సాయంత్రం ఐదు గంటలు దాటినా ఇంకా ఎండ మండిపోతోనే వుంది. మృగశిర వచ్చినా ఎండలు తగ్గి చస్తేనా! ఏవిటో...అంతా ఆయోమయం! సూర్యగోళంలో తుపాను ఒచ్చిందని ఒకళ్లూ, ఓజోను పొర దెబ్బ తిన్నదని ఒకళ్లూ... ఈ ఎండలకు కారణం మాత్రం ఏమిటో గానీ, నా అనుమానం– సూర్యుడూ రిటైరయ్యే రోజు దగ్గర పడిందని" అన్నాడు రామారావు శూన్యంలోకి చూస్తూ.

కాంతమ్మ అపచారం జరిగినట్టే చలించింది! "అయ్యో...అయ్యో! అప్రాచ్యపు మాటలంటే అవే మరి! సూర్య భగవానుడికి రిటైర్మెంటు ఏవిటి... చోద్యం కాకపోతే. ఆయనేమైనా మీకు మల్లే అల్ప మానవుడేమీ కాదు..." అన్నది.

"మరి ఇలాంటి విపరీత పరిణామాలేవిటి?"

"యుగసంధి ఇది! కలియుగాంతకాలం. ఋతువులు గతులు తప్పటం, మనుషులు నీతి తప్పడం, గౌరవ మర్యాదలు మంట కలవటం– అన్నీ మామూలే! పోతులూరి వీరబ్రహ్మం గారు ఆనాడే చెప్పేరు కదా...!ఐనా, వారిదాకా ఎందుకూ 'అది రిందబ్బా...అదిరింది' టీవీ సీరియల్లో అదే సబ్జక్టు! మీరు టీవీ చూడరు కదా, ఎలా తెలుస్తుంది మీకు! సరే...ఎండ తగ్గాకనే బజారుకు వెళ్లిరండి. వాకూ వేళ అవుతోంది! ఈ పూటకు ఆ నాలుగు అంట్లూ తోమేసి టీవీ ముందు కూర్చోవాలి. 'పతియే ప్రత్యక్ష దైవం' సీరియల్ మూడొందల ఏడో ఎపిసోడుంది ఈ వేళ! ' అని కాంతమ్మ హడావుడిగా వంట గదిలోకి వెళ్లిపోయింది.

తన రిటైర్మెంటు నాడు తనకన్నా ముందుగా రిటైరైన సూపరింటెండెంట్ సత్యారావు ఉబుసుపోక ఆఫీసుకు వచ్చి, ఏదో సందర్భంలో అన్నాడు కదా..."చూడు రామారావ్! మంత్రాల పెట్టెలు మానవ సంబంధాలను కూడా మూట కట్టి అటకవ వేస్తోన్నాయోయ్! మనసు విప్పి కష్ట సుఖాలు మాట్లాడుకొందామంటే ఇంట్లో అందరూ టీవీలకే అంకితమై పోతున్నారు. పోనీ, మిత్రుల ఇండ్లకు వెళ్లి కాలక్షేపం చేద్దామంటే అక్కడా యిదే తంతు!"అని.

"మంత్రాల పెట్టెలా?" ఆశ్చర్యంగా అడిగేడు రామారావు.

"అవ్వేనోయ్– టీవీ లంటే! మాంత్రికుడికి తెరమీద ప్రపంచ సుందరిని చూపించి బాలనాగమ్మకూ, కోట గోడ ఎక్కుతోన్న జగదేక వీరుడ్ని చూపించి బాలవర్ధి రాజుకూ ఆ రోజుల్లో కష్టాలు తెచ్చి పెట్టింది యిలాంటి మంత్రాల పెట్టే!" అని పెద్దగా నవ్వేడు సత్యారావు!

** ** ** **

'పతియే ప్రత్యక్ష దైవం' సీరియల్ చూస్తూ టివి ముందు కూర్చొని ప్రపంచాన్ని మర్చేపోయేరు కాంతమ్మ, పిల్లలూ!

అప్పడే బజారుకు వెళ్లి యింటికి తిరిగి వచ్చేడు రామారావు. ఒక చేతిలో కుంచె చీపురు, మరొక చేతిలో జాకెట్టు ముక్కల పొట్లం వుంది. 'ఉస్సో...' సని నిట్టూర్చి– "ఏమోయ్ కాంతం! జాకెట్టు ముక్కలు ఎంత నాణ్యమైనవి దొరికేయో చూడూ..." అంటూ రామారావు టివి ని తప్పుకొని భార్య కూర్చున్న వేపుకు వెళ్తోంటే– "అడ్డం వస్తారేం నాన్నగారూ!" అని విసుక్కుంది చిన్నమ్మాయి.

రామారావు టి.వీ తెర ముందు నుంచి అమాంతం అవతలికి దూకేడు సోఫాలో కూర్చున్న కాంతమ్మ ముందు వాలేడు. జాకెట్టు ముక్కల పొట్లాన్ని భార్య చేతిలో పెట్టి "విప్పి చూడూ...ఎంత బాగున్నాయో!" అన్నాడు విప్పారిన ముఖంతో.

ఆమె పొట్లాన్ని చాలా నిరాసక్తంగా పక్కకు గిరాటు వేసి మళ్లీ 'పతియే ప్రత్యక్ష దైవం'లో లీనమై పోయింది.

రామారావు హతాశుడయ్యేడు! ఏమి చెయ్యనూ పాలుపోక తను కూడా సోఫాలో కూర్చొని, యాంత్రికంగా టి.వి వైపు చూసేడు.

విరామంలో వ్యాపార ప్రకటనలు వస్తోన్నాయి. ఒళ్లు గగుర్పొడిచే దుర్భర సంగీత ఘోష, వెంటనే– 'వృద్ధులయ్యారా మీరు! ఎంత మాత్రం భయం లేదు! మార్కెట్లోకి వచ్చింది మా కలకంఠి కాఠిన్య తైలం!మూడు రోజులు మర్దిస్తే మోకాళ్ల నెప్పులు మటుమాయం!' అన్న బొంగురు గొంతూ, ఆ వెంటనే పెద్ద యిత్తడి వళ్లేన్ని బండలమీదికి విసిరేసినట్టు స్పెషల్ ఎఫెక్టూ...

మళ్లీ సీరియల్ మొదలైంది.

హీరోయిన్ చాలా గొప్ప పతివ్రత. ఆమె భర్తను గడ్డివాము దగ్గర కట్లపాము కాటు వేస్తుంది. గిల గిలా కొట్టుకొంటున్నాడు. నోటివెంట నురగలు కక్కేడు. దూరంగా వున్న భార్య అది గమనించి దగ్గరికి వచ్చి 'యా వండీ!" అని పిలువగానే కళ్లు వాల్చేసేడు. అతడి ప్రాణం పోయింది. వెంటనే ఆమె దేవుడ్ని చడా మడా తిడుతూ పాట పాడ్తుంది. పామును వళ్లెత్తు మాట అన్లేదు.

అతను వెంటనే లేచి కూర్చుంటాడు. 'నేను ఎక్కడున్నాను?' అని అడుగుతాడు, ఎదురుగా వున్న భార్యను.

"స్వామీ! నన్ను మీరు గుర్తు పట్టలేదా? ఎంతటి నిర్భాగ్యురాలనూ..."అంటూ దీర్ఘం తీసింది ఆమె.


అతడు భార్యవైపు పరీక్షగా చూసి "ఐతే నేను

చచ్చిపోలేదా? ఆ పాము విషం కూడా నన్నేమీ చెయ్యలేదా?" అన్నాడు. అలా అన్నప్పుడు ఆ ఆర్టిస్టు ఎవరో కానీ- కళ్లలో దైన్యం, గొంతులో జాలీ... ఫెమినిస్టులు కూడా 'అయ్యో పాపం'! అనేంత సహజంగా నటించేడు.

ఇంట్లో అందరూ ఆ దృశ్యాన్ని మైమరచి చూస్తోంటే రామారావు మాత్రం చూపులు ప్రక్కకు మర్లచుకొన్నాడు కానీ భర్త పాత్రలో ఆర్టిస్టు వాస్తవి కతను చూపించిన తీరును మాత్రం అభినందించ కుండా వుండలేక పోయేడు.

ఆ ఎపిసోడ్ అంతటితో ముగిసింది.

భార్యతో మాట్లాడేందుకు అదే అవకాశం అను కొన్నాడు రామారావు.



"కాంతం! కుంచె చీపురు తెచ్చి వరండాలో పెట్టేను. నువ్వొకసారి జాకెట్టు ముక్కలు విప్పి చూస్తే బావుంటుంది కదా...!" అంటూ పొట్లాన్ని చేత్తో అందుకొని భార్యకు యివ్వబోయాడు.

"అమ్మా...ఛానల్ మార్చవే! 'నువ్వా-నేనా' సీరి యల్ ఆరొందల ఆరోభాగం యివ్వడే వస్తుంది" అని అరిచింది అప్పడే చిన్నమ్మాయి పెద్దగా.

కాంతమ్మ చివాల్న సోఫాలోంచి లేచి టి.వి దగ్గరికి ఒక్క దూకు దూకి ఛానల్ మార్చింది. "అయ్యో...జ్ఞాపకమే లేదు! అమ్మాయి సమయానికి గుర్తు చేసింది కానీ, లేకుంటే మిస్సయ్యేదాన్నే! పైగా 'నువ్వా-నేనా' గొప్ప ఫామిలీ సెంటిమెంటు సీరియల్!" అని, వచ్చి సోఫాలో కూర్చుంటూ.

రామారావు భార్యా, పిల్లలను పరీక్షగా చూసేడు. వాళ్లంతా రకరకాల ద్రావకాలను కలిపి స్పిరిట్ ల్యాంపు మీద వేడి చేస్తూ పరీక్ష నాళిక వైపే కళ్లార్పకుండా చూస్తొన్న సైన్సు విద్యార్థులకు మల్లేనే కనిపించేరు టి.వీ ని చూస్తూ.

గుండె దడ పుట్టించే సంగీతపు హోరుతో సీరి యల్ మొదలైంది. ముఖం ప్రక్కకు తిప్పకొని రామారావు దృశ్య హింస నుంచి ఎలాగో వెళ్లి వాల్యూమ్ తగ్గించేడు. యాంత్రికంగానే టి.వీ వైపు చూశాడు.

అంతకు ముందు జరిగిన ఎపిసోడ్లో భార్యా భర్తల మధ్య (అంటే హీరో, హీరోయిన్ల మధ్య) ఏం గొడవ జరిగిందో రామారావుకు తెలియదు కానీ యిప్పడు మాత్రం సీరియల్ మొదలు కాగానే హీరోయిన్ గుడ్లు మిటకరించింది. హీరో వైపు క్రూరంగా చూస్తూ- తాళి బొట్టును అతడికి చూపిస్తూ-

"ఊ...కమాన్- క్విక్! నువ్వు కట్టిన తాళిని నువ్వే తెంచేయ్- ఎవరికేం పని! ఊ...కమాన్.. క్విక్!" అంటూ భర్త మీది మీదికి పోతోంటే పాపం, అతగాడు దీనంగా భార్యవేపు చూస్తూ-

"నేను తెంపను, తెంపనంటే తెంపను!" అని వెనకెనక్కు పోతోంటాడు.

ఆమె మరీ మీది మీదికి పోతోంటే సందు చూసుకొని ఉరుకుతాడు.

ఆమె వెంట పడుతుంది. అతడు పరుగు వేగం పెంచుతాడు. ఆమె డిటో!

ఇద్దరూ అలా ఉరికీ ఉరికీ, ఊరు దాటి, పంట పొలాల గట్ల వెంట పరుగెత్తి, చివరికి ఓ కొండ శిఖరం ఎక్కుతూంటే అప్పడు శ్రావ్యంగా నేపథ్యగానం వినిపించింది-

'ఓ...సుమంగళీ - కావాలి నువ్విక అమంగళి,
ఓర్చలేవే తల్లి ఎగతాళినీ...తెంచడేమే తల్లి నీ తాళినీ...!

రామారావు సహనం కోల్పోయేడు. ఒక పెద్ద బూతు కూత కూసి అక్కడ్నించి లేచి వెళ్లబోతోంటే, మధ్యాహ్నం భర్త నిద్ర పోతోన్నప్పడు పోస్టులో వచ్చిన ఉత్తరం గుర్తొచ్చింది కాంతమ్మకు. సోఫా మీద వున్న దిండు క్రింది నుంచి ఉత్తరాన్ని లాగి ఇస్తూ "పెద్దమ్మాయి రాసింది..." అని చెప్పి టి.వీ. వైపుకు తిరిగింది.

రామారావు తృప్తిగా గాలి పీల్చుకొన్నాడు. టి.వీ. గొడవకంటే దూరంగా వెళ్లి అమ్మాయి రాసిన ఉత్తరం చదవటమే ఆనందం అన్నట్టు హడావుడిగా వరండాలోకి వెళ్లి వాలు కుర్చీలో పడుకొన్నాడు. ఉత్తరం విప్పి చదవసాగేడు-

ప్రియమైన నాన్నకు!

'ఎదురుగాలి' సీరియల్లో హీరోయిన్ తండ్రికి మల్లే మీరు మరో రెండువేల ఎడిసోడ్ల కాలం ఆరోగ్యంగా వుండాలని కోరుకొంటున్నాను. నాన్నా! మన కలర్ టీవీ బాగుందా? మా బ్లాక్ అండ్ వైట్ బాగానే వుంది. 'క్షుద్ర సంతు' సీరియల్‌లా పిల్లల అల్లరి మరీ ఎక్కువైంది. వేగలేక చస్తున్నాన నుకో! ఒనీడా రాక్షసుడ్ని చూడాలని పెద్దవాడేమో యాగీ చేస్తుంటాడు, చూస్తేనా...చంటాడికి జ్వర మొస్తుంది. ఈ సమస్యకు పరిష్కారం తోచటం లేదు.

నాన్నా! టి.వి.లో అందమైన కురుల రహస్యం తెలుసుకొని ఈ మధ్య మా వార్ని పీడించి మూడు గుణాల తలమానె కొనిపించాను. వారం రోజులు వాడే సరికల్లా తల్లో అక్కడక్కడా వున్న తెల్ల వెంట్రుకలు నల్లబడ్డాయి కానీ నల్ల వెంట్రుకలన్నీ నెరసి పోయాయి. జడ పొడుగు తగ్గి భుజాలు దాటితే నీ మీద ఒట్టు! పట్టుకుచ్చులా అవుతోం దనుకొన్న జుట్టంతా జనప నారలా బిరుసెక్కింది.

కర్మ అలా కాలేక ఎవరు మాత్రం ఏమి చెయ్య గలర్లే నాన్నా...'రుతు ధర్మం' సీరియల్లో హీరోయిన్ పడుతోన్న కష్టాలతో నా కష్టం ఏపాటిదిలే అని నిబ్బరపడుతున్నాను.

నాన్నా! ఈ మధ్య మీ పెద్ద మనుమడు ఏం ఘనకార్యం చేసాడో తెలుసా...! వాడ్ని వెంట పెట్టుకొని షాపింగ్‌కు వెళ్లాను. స్నోలు, సబ్బులు, పౌడర్లు కొని ఆటోలో ఇంటికి వస్తున్నాను. "తాత య్యకు... తాతయ్యకు" అంటూ మీ మనుమడు పదే పదే ఏదో మననం చేసికొంటుంటే మీమీద బెంగ ఏమో అనుకొన్నాను. అంతలోకే ఏదో గుర్తొచ్చి "ఆ...తాతయ్యకు యాంటీ సెప్టిక్ లోషన్!" అని పెద్దగా అరిచి, అదే ఉద్రేకంలో-

"ఇవన్నీ మర్చిపోండి!" అని గర్జిస్తూ నా వడిలో వున్న సరుకుల క్యారీ బ్యాగును ఆటోలోంచి బైటికి విసరి కొట్టేడు.

ఎంత బ్రతిమాలినా ఆ ట్రాఫిక్కులో ససేమిరా ఆటోను ఆపను అన్నాడు డ్రైవరు. అలా వట్టి చేతులతో ఇంటికి తిరిగివచ్చి ఆటో ఛార్జి చెల్లించి పంపేను.

మీ అల్లుడుగారు మాత్రం తక్కువా! ఈ మధ్యనే మోపెడ్ కొన్నారు. వారెప్పడో టి.వీ.లో ఏదో యాడ్ చూసేరట. ఒక అమ్మాయి అలాంటి మోపెడ్ నడు పుతూ ట్రాఫిక్ కానిస్టేబులు ఎర్రలైటు చూపించినా ఆగకుండా వెళ్ళిందట. పోలీసులు వెంటపడ్డా దొరకలేదట. అది గుర్తొచ్చి మావారు కూడా అలాగే చేసేరట. వారి మోపెడ్ యింకా పోలీసు స్టేషన్లోనే వుంది.

నాన్నా! 'అంతం కాదిది' సీరియల్లా విసిగిం చానా? సెలవు!

చదవటం ముగించి కోపంగా ఉత్తరాన్ని క్రిందికి విసిరి కొడుతూ "కాంతం!" అని ఇల్లు అదిరేలా అరిచేడు రామారావు. అప్పడే కరెంటు పోతే టి.వీ ఒదిలిపెట్టి వచ్చింది కాంతం, భర్త దగ్గరికి.

"రేపు నేనేదైనా తీర్థయాత్రలకు వెళ్లి ఎక్కడో చచ్చిపోయానే అనుకో! పుణ్యాత్ము లెవరైనా నాకు కర్మకాండలు జరిపి, అదంతా వీడియో ఫిల్మ్ తీసి ఎలాగో మీ అడ్రసు కనుక్కొని క్యాసెట్టు పంపించారే అనుకో! ఇంత శ్రద్ధగా ఆ కేసెట్టూ వేసికొని చూస్తారా టీవీలో? అడిగేడు రామారావు.

కాంతమ్మ ఒక్కక్షణం ఆలోచించింది. "యిన్ని ఛానల్స్ వచ్చేక ఎప్పడూ ఏదో ఒక సీరియలో, సినిమానో వుంటూనే వుంటుందండీ...!" అని భర్తకు హామీ యివ్వకుండానే ఇంట్లోకి ఉరికింది కాంతమ్మ.

అప్పడే కరెంటు వచ్చినట్లుంది!